# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 19, ఆగస్టు 2026




# ఉపాధ్యాయుడు లేక మూతపడిన పాఠశాల

- పది రోజులుగా బోధనకు దూరమైన విద్యార్థులు
- ఉపాధ్యాయుడిని నియమించాలని తల్లిదండ్రుల విన్నపం

జైనూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పానపటార్ పంచాయతీ పరిధిలోని మర్కగూడ ఐటీడీప పాఠశాల ఉపాధ్యాయుడు లేక పది రోజులుగా మూతపడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల తెరుచుకోకపోవడంతో సుమారు 15 మంది గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. గతంలో పనిచేసిన ఉపాధ్యాయుడు పదవీ విరమణ పొందడంతో అధికారులు డిప్యూటేషన్‌పై మరొకరిని నియమించినప్పటికీ, సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరు కావడం లేదని స్థానికులు పేర్కొన్నారు. దీంతో చిన్నారులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి తిరిగి ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. విద్యాబోధన నిలిచిపోవడంతో తమ పిల్లల భవిష్యత్తు దెబ్బతింటోందని మర్కగూడ కోలం గిరిజనులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి మర్కగూడ పాఠశాలకు వెంటనే నిరంతరాయంగా పనిచేసే ఉపాధ్యాయుడిని నియమించాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా బోధన సాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలి

- సర్వే ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది
- కాగజ్‌నగర్‌లో సర్వే ప్రక్రియ రెండో దశ కార్యక్రమంలో మంత్రి జూపల్లి



కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

ప్రజలకు సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి సర్వే ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రన్‌గ్రాండ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అధ్యక్షతన నిర్వహించిన సర్వే ప్రక్రియ రెండో దశ కార్యక్రమం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, ప్రతి పోలింగ్ కేంద్రం స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన జరపాలని సూచించారు. సిర్పూర్ నియోజకవర్గంలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా నిలిపిన ఎమ్మెల్సీ దండే విఠల్‌ను మంత్రి అభినందించారు. ప్రజలకు సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ, సర్వే ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని అన్నారు. ప్రతి ఓటరు తమ వివరాలను మిగతా 2లో..

# విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి

సెమికండక్టర్ వర్క్‌షాప్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపు




నిర్మల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:

డిజిటల్ యుగంలో విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకుంటూ, అందుబాటులోకి వస్తున్న నూతన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. మంగళవారం బాసర ఐఐటీలోని సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల సెమికండక్టర్ డిజైన్ ప్రత్యేక వర్క్‌షాప్‌ను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సెమికండక్టర్ తయారీ, డిజైనింగ్ రంగాలకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని తెలిపారు. ఈ రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థకు, సాంకేతిక పురోగతికి ప్రాణపదమని పేర్కొన్నారు. విద్యార్థులు కోర్ సబ్జెక్టులపై పట్టు సాధిస్తూనే ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకుని శాస్త్ర మిగతా 10లో..



# క్షణాన్ని చరిత్రగా మలిచే కెమెరా కన్ను..



- చిత్రం, భళారే విచిత్రం...
- బ్లాక్ అండ్ వైట్ నుంచి సెల్ఫీ వరకు.. ఫొటోగ్రఫీ ప్రస్థానంలో ఎన్నో మలుపులు
- జ్ఞాపకాలకు రూపమిచ్చి.. చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న ఛాయాచిత్రం
- సాంకేతిక విప్లవంతో ప్రతి చేతిలో కెమెరా.. మారిన ఫొటోగ్రఫీ ప్రపంచం
- క్లిక్.. క్లిక్.. నేడు ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

– నస్పూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త





2లో..

# క్షణాన్ని చరిత్రగా మలిచే కెమెరా కన్ను..



నస్పూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త

**ఒక క్షణం... ఒక దృశ్యం... ఒక క్లిక్... అంతే! కాలగర్భంలో కలిసిపోయే ఓ చిన్న సంఘటనను శాశ్వతంగా మన కళ్లముందు నిలిపేది ఫొటో. మాటల్లో చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రం చెప్పగలదు. అందుకే ఫొటోగ్రఫీని కేవలం కళగా కాకుండా చరిత్రను భద్రపరిచే సాధనంగా, సమాజాన్ని ప్రతిబింబించే అద్దంగా అభివర్ణిస్తారు. ప్రతి ఏడాది ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్‌లో లూయిస్ డాగెర్ అభివృద్ధి చేసిన డాగెరోటైప్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ తేదీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. అప్పట్లో సుదీర్ఘ ప్రక్రియగా ఉన్న ఫొటోగ్రఫీ.. కాలక్రమంలో ఎన్నో సాంకేతిక మార్పులకు లోనై నేడు ప్రతి ఒక్కరి చేతిలోని స్మార్ట్‌ఫోన్ వరకు చేరింది.**



## బ్లాక్ అండ్ వైట్ నుంచి డిజిటల్ దాకా..

ఫొటోగ్రఫీ ప్రారంభ దశలో ఒక చిత్రాన్ని రూపొందించడానికి ఎంతో సమయం, శ్రమ, ప్రత్యేక రసాయనాలు అవసరమయ్యేవి. తొలి ఫొటోగ్రాఫిక్ ప్రక్రియలు నెమ్మదిగా అభివృద్ధి చెందుతూ, చివరకు డాగెరోటైప్ వంటి ఆచరణాత్మక విధానాలకు దారితీశాయి. ఆ తర్వాత ఫిల్మ్ కెమెరాలు, రంగు ఫొటోగ్రఫీ, ఆటోమేటిక్ కెమెరాలు, డిజిటల్ కెమెరాలు, చివరకు స్మార్ట్‌ఫోన్ కెమెరాలు... ఇలా సాంకేతిక పరిణామం ఫొటోగ్రఫీని సామాన్యుడికి చేరువ చేసింది. ఒకప్పుడు ఫొటో తీయడానికి కెమెరా, ఫిల్మ్, స్టూడియో అవసరమైతే.. ఇప్పుడు జేబులోని మొబైల్ ఫోన్‌తోనే అధిక నాణ్యత కలిగిన చిత్రాలను క్షణాల్లో చిత్రీకరించి ప్రపంచంతో పంచుకోవచ్చు.

## వార్తకు కళ్లు.. ఫొటో జర్నలిజం

వార్తా ప్రపంచంలో ఫొటోగ్రఫీకి మరింత ప్రత్యేక స్థానం ఉంది. ఒక సంఘటనను వంద మాటల్లో వివరించినా కలగని ప్రభావం.. సరైన సమయంలో తీసిన ఒక్క ఫొటోతో కలుగుతుంది. ప్రమాదం, ప్రకృతి విపత్తు, ప్రజా ఉద్యమం, రాజకీయ పరిణామం, క్రీడా విజయం, సామాజిక సమస్య... ఏదైనా ఫొటో దానికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తుంది. అందుకే ఫొటో జర్నలిస్టు కేవలం కెమెరా పట్టుకున్న వ్యక్తి కాదు. సంఘటనలోని అసలు భావాన్ని గుర్తించి, సరైన క్షణాన్ని ఒడిసిపట్టి, సమాజం ముందు ఉంచే బాధ్యతాయుతమైన కథకుడు. అతడి కెమెరా కన్ను ఎన్నో సందర్భాల్లో చరిత్రను రికార్డు చేస్తుంది.

## ఒక చిత్రం.. ఒక కాలానికి సాక్ష్యం

మన జీవితంలో ఎన్నో సంఘటనలు కాలంతో మసకబారిపోతాయి. కానీ ఒక ఫొటో వాటిని మళ్లీ మన కళ్లముందుకు తీసుకురాగలదు. కుటుంబ జ్ఞాపకాల నుంచి దేశ చరిత్ర వరకు.. వ్యక్తిగత జీవితాల నుంచి సామాజిక పరిణామాల వరకు ఫొటోగ్రఫీ మన గతాన్ని భద్రపరుస్తోంది. అందుకే ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం కేవలం ఫొటోగ్రాఫర్లను అభినందించే రోజు మాత్రమే కాదు. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించే చూపును, క్షణాలను విలువైన జ్ఞాపకాలుగా మార్చే కళను, సమాజానికి వాస్తవాన్ని చూపించే కెమెరా కన్నును గుర్తుచేసే రోజు. క్లిక్ చిన్నదే కావచ్చు.. కానీ ఆ చిత్రంలో ఒక కాలం దాగి ఉండొచ్చు!

## స్మార్ట్‌ఫోన్‌తో సులువైన ఫొటోగ్రఫీ

స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావడంతో ఫొటోగ్రఫీ మరింత సులభమైంది. బ్లాక్ అండ్ వైట్ ఫొటోలతో ప్రారంభమైన ప్రస్థానం ప్రస్తుతం సెల్ఫీల వరకు చేరింది. మొబైల్ కెమెరాలతో తీసిన సెల్ఫీలను ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ పలువురు తమ అనుభూతులను పంచుకుంటున్నారు. ముఖ్యంగా యువతలో సెల్ఫీలపై ఆసక్తి ఎక్కువగా కనిపిస్తోంది. అయితే సెల్ఫీల కోసం ప్రమాదకర సాహసాలకు పాల్పడటం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.

## ఫొటోగ్రఫీపై పెరుగుతున్న ఆసక్తి


జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కళాశాల, లకోటియా ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ తదితర సంస్థలతో పాటు ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లోనూ ఫొటోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నారు. నాలుగేళ్ల కోర్సులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. ఫ్యాషన్, పారిశ్రామిక, పర్యాటక, ట్రావెల్, జర్నలిజం ఫొటోగ్రఫీతో పాటు కంప్యూటర్ గ్రాఫిక్స్‌లోనూ శిక్షణ అందిస్తున్నారు. ఒకప్పుడు పురుషులకే పరిమితమైన ఈ రంగంలో ప్రస్తుతం మహిళలు కూడా సమానంగా ఆసక్తి చూపుతున్నారు.

## సింగరేణి కార్మికులపై తీసిన ఫొటోకు ఏపీ అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ అవార్డు

సింగరేణి విశ్రాంత ఉద్యోగి, ప్రముఖ ఫొటోగ్రాఫర్ పొడిచేటి సంపత్ కుమార్ తీసిన ఫొటోకు ఏపీ అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ అవార్డు దక్కింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అకాడమీ నిర్వహించిన పోటీలో భూగర్భ గనుల్లో సింగరేణి కార్మికుల పని తీరును చిత్రీకరించిన ఆయన ఫొటో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. పోటీలో 100 మందికిపైగా ప్రముఖ ఫొటోగ్రాఫర్లు పాల్గొని 510కిపైగా ఛాయాచిత్రాలను సమర్పించగా, 18 మందికి అవార్డులు ప్రకటించారు. ఇందులో సంపత్‌కుమార్ ఉద్యోగ జీవితంలో భాగంగా భూగర్భ గనుల్లో కార్మికుల పని విధానాన్ని కెమెరాలో బంధించిన చిత్రం అవార్డుకు ఎంపికైంది.

## ఫొటోగ్రఫీ రంగం లేని సమాజం లేదు

**- పొడిచేటి సంపత్ కుమార్, జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ అవార్డు గ్రహీత, తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ ఉపాధ్యక్షుడు**



ఫొటోగ్రఫీ ఒక సజీవ కళ. చిత్రకారులు కుంచెతో చిత్రాలు గీస్తే.. ఫొటోగ్రాఫర్లు కాంతితో చిత్రాలను ఆవిష్కరిస్తారు. నేడు ఫొటోగ్రఫీ దైనందిన జీవితంలో భాగమైంది. వెయ్యి పదాలు చెప్పలేని భావాన్ని ఒక ఫొటో తెలియజేస్తుంది. ఈ రంగానికి కులం, మతం ఉండదు.. నైపుణ్యం, సృజనాత్మకతే ప్రధాన బలం. మారుతున్న సాంకేతికత, సెల్‌ఫోన్ ఫొటోగ్రఫీతో ఫొటోగ్రాఫర్లకు పోటీ పెరిగింది. అధునాతన మొబైల్ ఫోన్లతో పాస్‌పోర్ట్ ఫొటోల నుంచి చిన్నచిన్న కార్యక్రమాల వరకు ఫొటోలు తీస్తున్నారు. మరోవైపు కెమెరాల అధిక ధరలు కూడా ఫొటోగ్రాఫర్లకు భారంగా మారాయి. ప్రభుత్వం సబ్సిడీపై కెమెరాలు అందించడంతో పాటు బ్యాంకు రుణాలు కల్పించి ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి. ఇన్ని సవాళ్ల మధ్య నైపుణ్యంతో వృత్తిని కొనసాగించడం సాహసోపేతమైన చర్య.

## మొబైల్ కెమెరా వచ్చినా.. ప్రొఫెషనల్ ఫొటోకు ఆదరణ ఉంది

**- గంధం రాజు, ఫొటో స్టూడియో యజమాని**



ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ కెమెరా ఉండటంతో సాధారణ ఫొటోగ్రఫీ కొంత తగ్గింది. అయినా పెళ్లిళ్లు, శుభకార్యాలు, పాస్‌పోర్ట్, వీసా, ఐడీ ఫొటోలు, ప్రత్యేక కార్యక్రమాలకు ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీకి ఇప్పటికీ మంచి ఆదరణ ఉంది. డిజిటల్ టెక్నాలజీతో ఫొటో తీసిన వెంటనే ఎడిటింగ్, ప్రింటింగ్ చేయగలుగుతున్నాం. ఏఐ, అధునాతన కెమెరాలు వచ్చినా మంచి ఫొటోకు అవసరమైన సృజనాత్మకత, సరైన సమయం, భావాన్ని బంధించే నైపుణ్యం ఫొటోగ్రాఫర్‌దే. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకుంటే ఫొటోగ్రఫీ రంగానికి మంచి భవిష్యత్ ఉంటుంది.

## కెమెరా మారింది.. ఫొటో విలువ మాత్రం మారలేదు

**- జక్కినబోయిన గోపాల్, నస్పూర్**



నేను చిన్నతనం నుంచి ఫొటోగ్రఫీలో ఎన్నో మార్పులు చూశాను. అప్పట్లో ఫొటో తీయించుకోవడం ఎంతో ప్రత్యేకం. పెద్ద కెమెరాలతో ఫొటో తీసి, ఫిల్మ్‌ను డెవలప్ చేసి ప్రింట్ ఇచ్చేవారు. బ్లాక్ అండ్ వైట్ ఫొటోల నుంచి కలర్ ఫొటోలు, ఆ తర్వాత డిజిటల్ కెమెరాలు, ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ కెమెరా వరకు ఫొటోగ్రఫీ ఎంతో మారిపోయింది. ఇప్పుడు క్షణాల్లో ఫొటో తీసి వెంటనే చూడటమే కాకుండా ప్రపంచంలో ఎక్కడికైనా పంపించగలుగుతున్నారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా.. మన జ్ఞాపకాలను పదిలంగా ఉంచే ఫొటోకు ఉన్న విలువ మాత్రం ఎప్పటికీ తగ్గదు. పాత ఫొటోలను చూసుకుంటే ఆనాటి మనుషులు, సందర్భాలు, జ్ఞాపకాలు కళ్లముందు మెదులుతాయి. నా జీవితకాలంలో ఫొటోగ్రఫీలో వచ్చిన ఈ మార్పులను చూడటం ఎంతో ఆనందంగా ఉంది.

# ప్రజలకు సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలి



(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిర్పూర్ నియోజకవర్గం సర్వే ప్రక్రియలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, ఇరుకుళ్ల మంగతో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా పాపన్న గౌడ్ 376వ జయంతి

## అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు: అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

**నిర్మల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు మంగళవారం నిర్మల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, కుల సంఘాల నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. 17వ శతాబ్దంలో పాలకులు సాగించిన అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పిన తొలి తిరుగుబాటు వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. బహుజన రాజ్య స్థాపన కోసం అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి సైన్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పాపన్న గౌడ్ చూపిన పోరాట పటిమ, స్వాభిమానం నేటి తరానికి ఆదర్శమని, ఆయన త్యాగాలను స్మరించుకుంటూ సమాజంలో సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.సంఘ నాయకుడు అమరవేణి నర్సగౌడ్ మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, బీసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**సారంగాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పోరాడిన వీరుడని కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర నేటి సమాజానికి ఆదర్శమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బహుజనుల ఆత్మగౌరవ పోరాటానికి పాపన్న గౌడ్ చిరస్మరణీయ స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఎల్లా గౌడ్, నితీష్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, చంద్రమోహన్ గౌడ్, నిఖిల్ గౌడ్, నవీన్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, బాలు గౌడ్, విగ్నేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### యువత ఆదర్శంగా తీసుకోవాలి: మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తు

**నిర్మల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని గురుకృపా వొకేషనల్ కాలేజీ ప్రాంగణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గౌడ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి భైంసా మున్సిపాలిటీ చైర్మన్ తూమొల్ల దత్తు ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ ఐక్యత, ఆత్మగౌరవం కోసం చేసిన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, సమాజ అభ్యున్నతికి, ఆత్మగౌరవ పోరాట వారసత్వాన్ని కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు. సామాజిక సమానత్వం కోసం పాపన్న గౌడ్ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, సుభాష్, అడ్వకేట్ ప్రవీణ్ కుమార్, గౌడ సంఘం నాయకులు గంగాధర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బిజెపి నాయకులు భోస్లే బాజీరావు పటేల్, డాక్టర్ మహిపాల్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండపు కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### బహుజనుల ఆత్మగౌరవ పోరాటం స్ఫూర్తిదాయకం: రావుల రాంనాథ్

**నిర్మల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి పేదల కోసం సొంత రాజ్యాన్ని స్థాపించిన బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ మాట్లాడుతూ.. మొఘల్ పాలకుల ఆధిపత్యాన్ని ధైర్యంగా ఎదిరించి గోల్కొండ కోటను జయించిన గొప్ప వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యసాహసాలు, సమసమాజ స్థాపన కోసం చేసిన కృషి నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు డి. ముత్యం రెడ్డి, కౌన్సిలర్ కూన శశాంక్, మాజీ కౌన్సిలర్ నరేందర్, నాయకులు కందుల హరీష్, పుదరి రంజిత్, సంతోష్, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**వేమనపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలంలోని ముల్కలపేట గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జెండాను ఆవిష్కరించారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆకుల లింగగౌడ్, రంగు శంకర్ గౌడ్, పబ్బ రాజగౌడ్, ఆకుల తిరుపతి గౌడ్, విజయ్, శేఖర్, వేపూరి శంకర్ గౌడ్‌తో పాటు గౌడ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు

**బెజ్జూర్,ఆగస్టు 18,ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గౌడ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మొఘల్ పాలకుల అరాచకాలను ఎదిరించి బడుగు,బలహీన,అనగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని వారు గుర్తు చేసుకున్నారు. నేటికి కూడా వారు చూపిన బాటలో నడుస్తూ మన హక్కుల సాధన కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుధాకర్ గౌడ్,రవీందర్ గౌడ్,నరేందర్ గౌడ్,కార్తీక్ గౌడ్,దిలీప్ గౌడ్,రమేష్ గౌడ్,గౌడ కులస్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.





**తాండూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబీ కేంద్రంలో మంగళవారం తెలంగాణ వీరుడు, ప్రజా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. సామాన్య కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న గౌడ్ తన కాలంలో సామాజిక అన్యాయాలను ఎదురించి ప్రజల కోసం పోరాడారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిస్తూ గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పురుషోత్తం గౌడ్, శంకర్ గౌడ్, ప్రసాద్ గౌడ్, మనోహర్ గౌడ్, రవిగౌడ్, మొండి గౌడ్, కిష్ట గౌడ్, సుధీర్ గౌడ్, భాస్కర్ గౌడ్, మహీధర్ గౌడ్, పున్నం గౌడ్, ప్రసాద్ గౌడ్,సాయివర్ధన్ గౌడ్, నవీన్ గౌడ్, సాయి సృజన్ గౌడ్, రుత్విక్ గౌడ్, అభిజిత్ గౌడ్, సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





జయంతి వేడుకలలో పాల్గొన్న గౌడ కులస్తులు




చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గౌడ కులస్తులు

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం



### ❊ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే లతో కలిసి హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా కష్టపడి పనిచేసి చిన్న చిన్న లక్ష్యాలను సాధిస్తూ పెద్ద లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. మనమంతా ఐక్యంగా ఉన్నంతకాలం అభివృద్ధి వైపు ముందుకు సాగగలుగుతామని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ద్వారా ఆత్మవిశ్వాసం, సమష్టి కృషి ఉంటే మంచి ఫలితాలను సాధించవచ్చనే సందేశం తెలుస్తుందని, పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. మహానుభావుల ఆశయాలు, ఆచరణాత్మక పద్ధతులు భావితరాలకు తెలిసే విధంగా మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వెనుకబడిన తరగతులు, గౌడ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు చదువుల్లో రాణించాలి

**- జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18, ప్రభాతవార్త**

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చేరాల వంశీ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకొని సమాజ అభివృద్ధిలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు యువత, విద్యార్థులు ఐక్యంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొన్మనబోయిన సైదులు యాదవ్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రవి కుమార్, శ్రీధర్ యాదవ్, సాయితో పాటు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**మంచిర్యాల, ఆగస్టు 18, ప్రభాతవార్త**

సర్దార్ సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ అన్నారు. పాపన్న జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న అణచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పాపన్న ధైర్యంగా పోరాడారని కొనియాడారు. అంచలంచెలుగా సైన్యాన్ని సమీకరించి అనేక కోటలను స్వాధీనం చేసుకుని ప్రజలకు విముక్తి కల్పించిన గొప్ప యోధుడని అన్నారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల అశోక్‌వర్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎనగందుల కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు కస్తూరి నాగరాజు, బొట్ల సత్యనారాయణ, జోనల్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్‌కుమార్, సత్రం రమేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పచ్చ స్వప్న, ఎస్టీ మోర్చా అధ్యక్షులు ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**- జిల్లా ఆదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**

**కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18, ప్రభాతవార్త :**

బహుజన ఆత్మగౌరవానికి తొలి పతాకం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, వారి జీవిత చరిత్ర నేటి తరాలకు ఆదర్శనీయమని జిల్లా ఆదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, గౌడ సంఘాల నాయకులు, బిసి సంఘాల నాయకులతో కలిసి హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టి అప్పటి మొగల్ పాలకుల అరాచకాలను ఎదిరించి గోలుగొండ పాలించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. పాలకులకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన ప్రజలకు అండగా నిలిచారని, ప్రతి ఒక్కరు పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గౌడ సంఘాల నాయకులు తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా నివేదిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నదీమ్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, గౌడ సంఘాల ప్రతినిధులు బాలేశ్వర్ గౌడ్, కేసరి ఆంజనేయులు గౌడ్, కొండ్ర మనోహర్ గౌడ్, మార్క శంకర్ గౌడ్, మహిళా సంఘాల ప్రతినిధులు నీరజ గౌడ్, గౌడ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## దివ్యాంగుల నూతన పెన్షన్లపై వీడియో కాన్ఫరెన్స్

**- నూతన దరఖాస్తుదారులకు పింఛను మార్గదర్శకాలు విడుదల**



**సారంగాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఆధ్వర్యంలో దివ్యాంగుల నూతన పింఛన్ల మార్గదర్శకాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సారంగాపూర్ మండలంలో ఐకేపీ ఏపీఎం మాధురి ఆధ్వర్యంలో దివ్యాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెర్ప్ అధికారులు పింఛన్ల మంజూరుకు సంబంధించిన పలు మార్గదర్శకాలను వివరించారు. నూతనంగా పింఛన్ కోరే దివ్యాంగులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 40 శాతం సదరం వైకల్యం కలిగిన వారు అర్హులని, పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను ఎంపీడీవో, డీఆర్‌డీఓ లాగిన్‌ల ద్వారా పరిశీలిస్తారని తెలిపారు. ఇప్పటికే పింఛన్ పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సదరం సర్టిఫికెట్ గడువు ముగిసిన వారు ఆగస్టు 31లోగా స్లాట్ బుక్ చేసుకుని, సదరం క్యాంప్‌నకు వెళ్లి నూతన సర్టిఫికెట్ పొందాలని, అర్హులైన దివ్యాంగులకు నెలకు రూ. 4,016 పింఛన్ అందుతుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు స్వైప్‌కార్డ్ లేదా యూఐడీ కార్డ్ తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల టెక్నికల్ సపోర్ట్ ఏజెన్సీ రిసోర్స్ పర్సన్ సుంకేవార్ సాయి ప్రసాద్, మండల సీసీ భూమేష్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సాకలి సురేందర్, వెలుగు సీఆర్‌పీలు లావణ్య, పద్మ, దివ్యాంగులు భోజవ్వ, గంగామణి, నర్సయ్య, సురేందర్, రమేష్ రెడ్డి, దశరథ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం

**నిర్మల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బాసర మండలం బిద్రెల్లి సమీపంలో వర్షాలకు దెబ్బతిన్న అంతర్రాష్ట్ర రహదారిని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి ఎంతమేరకు దెబ్బతిందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనదారులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే మరమ్మతు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు హెచ్చరికగా అవసరమైన సూచిక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో రక్తదానం

## - రక్తదాన శిబిరంలో పాల్గొని దాతలకు ప్రశంసాపత్రాల అందజేసిన మాజీ డిసిసి అధ్యక్షురాలు

**మంచిర్యాల, ఆగస్టు 18, ప్రభాతవార్త**

ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా వృత్తిపరమైన ఛాయాచిత్ర, దృశ్య చిత్రకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హరిత ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొని రక్తదాతలను అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప మేయర్ సల్ల రమ్య-మహేష్‌తో పాటు జిల్లా ఛాయాచిత్ర, దృశ్య చిత్రకారుల సంక్షేమ సంఘం సభ్యులు, పలువురు రక్తదాతలు పాల్గొన్నారు. ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవాన్ని సేవా స్ఫూర్తితో నిర్వహించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది

# నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కొరడా

## - హెల్మెట్ లేకుండా ప్రయాణం.. ముగ్గురు ప్రయాణం.. పెండింగ్ జరిమానాలపై ట్రాఫిక్ పోలీసుల నిఘా

**మంచిర్యాల, ఆగస్టు 18, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్. రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులు, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్న వారు, జరిమానాలు పెండింగ్‌లో ఉన్న వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు తగిన జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. రహదారి భద్రతే లక్ష్యంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# కులగణన శాస్త్రీయంగా సాగాలి

## - బీసీలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం చేయాలి
## - బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్

**మంచిర్యాల, ఆగస్టు 18, ప్రభాతవార్త**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీల వాస్తవ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులు వెలుగులోకి రావాలంటే కులగణన ఖచ్చితంగా, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో జరిగిన సామాజిక-ఆర్థిక కుల సర్వేలో ఉపకులాలు, ఇంటిపేర్లు, ప్రాంతీయ పేర్లు వేర్వేరుగా నమోదైన లోపాలు పునరావృతం కాకుండా ముందస్తు కులాల జాబితా, ప్రత్యేక కోడ్ విధానం, మారుపేర్ల సమీకరణ చేపట్టాలని కోరారు. ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్ కేటాయించి ప్రామాణిక గణాంకాలు రూపొందిస్తేనే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల్లో బీసీలకు న్యాయమైన వాటా దక్కుతుందన్నారు. కులగణనను కేవలం లెక్కల ప్రక్రియగా కాకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడే చారిత్రక పత్రంగా రూపొందించాలని, బీసీల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని నరెడ్ల శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో బొలిశెట్టి లక్ష్మణ్, రంగు రాజేశం, ఎండి లతీఫ్, గుండ్ల లక్ష్మణ్, మెంతాల సంతోష్, గందె శ్రీ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న అర్చకులు, పురోహితులు

# ఆలయాలు దర్శన కేంద్రాలు కాదు.. ఆధ్యాత్మిక చైతన్య కేంద్రాలు

## - గోమాతను జాతీయమాతగా ప్రకటించాలి.. గోవధ నిర్మూలనకు కఠిన చట్టాలు అమలు చేయాలి

**మంచిర్యాల, ఆగస్టు 18, ప్రభాతవార్త**

ఆలయాలు కేవలం దర్శనం చేసుకుని వెళ్లే ప్రదేశాలు కాకుండా సనాతన ధర్మం, నైతిక విలువలు, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే కేంద్రాలుగా మారాలని అర్చకులు, పురోహితులు తీర్మానించారు. మంచిర్యాల పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో ఆధ్యాత్మిక భారతి ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఆలయంలో భక్తులకు ధర్మ ప్రబోధం, పూజా విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు యువతకు సనాతన ధర్మం, గోసంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. గోమాతను జాతీయమాతగా ప్రకటించాలని, గోవధ నిర్మూలనకు కఠిన చట్టాలు అమలు చేయాలని కోరుతూ డిసెంబరు పదిహేడో తేదీ వరకు నలభై కోట్ల సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గో అభియాన్ జిల్లా ప్రభారీ వేముల హరిప్రసాద్, కర్ణకంటి రవీందర్, గోనె శ్యామ్‌సుందర్‌రావు, విశ్వనాథ ఆలయ చైర్మన్ దొంతుల ముఖేష్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి వేముల రమేష్, కామాఖ్య పీఠాధిపతులు సతీష్ భవాని, ప్రధాన అర్చకులు నరహరి శర్మతో పాటు పలువురు అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ నిమ్మల సాగర్ పుట్టినరోజు వేడుకలు

## - పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**కోటపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త**



లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూరు ప్రెసిడెంట్ లయన్ నిమ్మల సాగర్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఆయన స్వగ్రామమైన కొల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని యుపిఎస్ రావులపల్లి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు అందజేశారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని విద్యార్థుల చదువుకు ఉపయోగపడే విధంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హారిక, నిమ్మల సాగర్ కుటుంబ సభ్యులైన అమ్మ సారక్క, సతీమణి నిమ్మల విశాల, నిమ్మల సంతోష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 24న చెన్నూరులో ఉచిత నేత్ర వైద్యశిబిరం

## - కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీఐ కృష్ణ, ఎస్ఐ రాజశేఖర్

**కోటపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త**




చెన్నూరు స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్ వేదికగా ఈ నెల 24వ తేదీ సోమవారం నాడు ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కోటపల్లి సీఐ ఆర్. కృష్ణ, ఎస్ఐ రాజశేఖర్ మంగళవారం అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో చూపు మందగించి ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని, లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని పెద్ద సంఖ్యలో ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నూరు ప్రెసిడెంట్ లయన్ నిమ్మల సాగర్, జోన్ చైర్‌పర్సన్ లయన్ జాడి తిరుపతి, లయన్స్ క్లబ్ నాయకులు సౌడం సంతోష్, భూతం శ్యాంసుందర్, తడకల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలి

## - జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు మాలీ సంక్షేమ సంఘం వినతి

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

మహాత్మా జ్యోతిరావు పూలే వారసులైన మాలీ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు ఆధ్వర్యంలో నాయకులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని సుమారు ఐదు లక్షల మంది మాలీ కులస్థులు సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తోట మాలీలుగా, వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు, బీడీ ఆకు కూలీలు, కార్మికులుగా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, నల్గొండ, వరంగల్ తదితర ప్రాంతాల్లో మాలీలు వెనుకబడిన జీవన పరిస్థితుల్లో ఉన్నారని వివరించారు. మాలీల సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఎస్టీ జాబితాలో చేర్చాలని గతంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చేసిన విజ్ఞప్తులను కూడా వారు ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రంలో మాలీలకు ప్రాంతాల వారీగా వేర్వేరు సామాజిక వర్గ గుర్తింపులు ఉండటం వల్ల తెలంగాణ ప్రాంత మాలీలు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మాలీల్లో అక్షరాస్యత శాతం తక్కువగా ఉందని, విద్యా, ఉద్యోగ రంగాల్లో తమ ప్రాతినిధ్యం చాలా పరిమితంగా ఉందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మాలీలకు ఎస్టీ హోదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రిని కోరారు. కేంద్రంపై ఒత్తిడి తేవాలితెలంగాణ ఉద్యమంలో మాలీ కులస్థులు సకల జనుల సమ్మె, రైలు రోకో, రాస్తారోకో వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. మాలీలకు ఎస్టీ హోదా కల్పిస్తామని వివిధ రాజకీయ పార్టీలు గతంలో హామీలు ఇచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో గిరిజన రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి పంపినప్పటికీ, ఇప్పటివరకు ఆమోదం లభించలేదని పేర్కొన్నారు. మాలీలకు ఎస్టీ హోదా కల్పించే అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు, పార్లమెంట్ సభ్యులతో కలిసి పోరాటం చేయాలని జూపల్లి కృష్ణారావును కోరినట్లు తెలిపారు.



### మాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఎస్టీ హోదాతో పాటు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగ పరంగా వెనుకబడిన మాలీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో మాలీల ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని కోరారు. మాలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరినట్లు రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు, పూలే సేవా సమితి సభ్యులు, మాలీ కులస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## - డిప్యూటీ డీఎంహెచ్ ఓ.సుధాకర్ నాయక్

తాండూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

దోమల వల్ల మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్ అన్నారు. మండలంలోని మాదారం3 ఇంక్లైన్ లో మంగళవారం దోమల నివారణకై నిర్వహించిన ఇంటింటా దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ చందనాల రవికుమార్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇళ్ల చుట్టూ పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఇళ్లలోని నీటి పాత్రలు, కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమల నివారణ చర్యలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ముమ్మరంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

ఆసిఫాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లాలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీ వాసవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వైద్య సిబ్బంది విద్యార్థినులకు హెచ్‌పీవీ టీకాలు వేశారు. భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు సంబంధిత వ్యాధుల నుంచి ముందస్తు రక్షణ కల్పించేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అర్హత కలిగిన ప్రతి బాలిక తప్పనిసరిగా టీకా వేయించుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సూచించింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ నజీమున్నీసా, సూపరింటెండెంట్ నర్సమ్మ, ఏఎన్ఎం పుష్పలత, ఆశా వర్కర్ నాగరాణి, పాఠశాల ప్రిన్సిపల్ మహేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి

# అసంపూర్తిగా ఉన్న బీసీ బాలికల వసతిగృహాన్ని పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో అసంపూర్తిగా ఉన్న బీసీ బాలికల పోస్టుమెట్రిక్ వసతిగృహ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం వసతిగృహ భవనాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణంలో 70 శాతం పనులు పూర్తయినా మిగిలిన పనులు నిలిచిపోయాయని తెలిపారు. భవనం నిరుపయోగంగా ఉండటంతో పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని, తద్వారా 200 మందికి పైగా బాలికలకు వసతి కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు షేక్ సమీర్, ఉపాధ్యక్షుడు శివశంకర్, సహాయ కార్యదర్శి బొరే వసంత్, నాయకులు మడవి సమీర్, ఫరియాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుల డిమాండ్లను పరిష్కరించాలి

తాండూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయు) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గత 80 సంవత్సరాలుగా రాష్ట్రోపాధ్యాయ సంఘం విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఈ ఎల్ లు, చైల్డ్ కేర్ లీవులు, సర్వీస్‌కి సంబంధించి వివిధ రకాల పనులను, ప్రొసీడింగ్‌లను ఎంఈఓలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆలస్యం చేయకుండా నిర్ణీత సమయంలో చేయాలన్నారు. ప్రభుత్వం పెండింగ్ డీఏ లను వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న జీపీఎస్, సీపీఎస్, ఈఎల్ మొదలైన బిల్లులను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు కవిత రత్నం, ఇఫ్తికర్, రామయ్య , గజియా ఫిర్దోస్, సాబీర్, నుజాత్ కాతూన్, శ్రీనివాస్, పద్మ, ప్రవీణ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



తాండూర్‌లో ఎస్టీయు సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

# వాట్సాప్ చాట్‌బాట్‌కు ఏఐ అనుసంధానం

ఆసిఫాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

విద్యుత్ వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ వాట్సాప్ చాట్‌బాట్‌కు ఏఐను అనుసంధానం చేసినట్లు కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడె మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 గంటలు అందుబాటులో ఉండే చాట్‌బాట్ ద్వారా విద్యుత్ ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, కొత్త సర్వీసు కనెక్షన్, సోలార్ తదితర సేవలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చన్నారు. వినియోగదారులు 87124 81489 నంబర్‌ను సేవ్ చేసుకుని వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ 1912, ఏఐ వాట్సాప్ చాట్‌బాట్, మొబైల్ యాప్, వెబ్‌సైట్ వంటి డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. వినియోగదారుల సంతృప్తే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# సాగునీటి అవసరాలకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త**

ఎల్ నినో నేపథ్యంలో రైతులు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరం గల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండలంలో గల గొల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం నేపథ్యంలో రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ప్రాజెక్టులోని నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భీమారం మండల తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రతిపాదిత భూమి, మండలంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవనం పనులను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులను అందుబాటులో



ఉంచుకోవాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విలువైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల చదువు, పరీక్షల సన్నద్ధతపై సమీక్షించి, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే రీతిగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారితో మాట్లాడి వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై సూచనలు చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాలు, పంటల సాగుకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సదానందం, ఆర్.ఐ. రజిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే చొరవతో జైనూర్‌లో ఇకనుంచి వెలుగులు

### గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఏడు ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు

**జైనూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కొమురం భీం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి నిధులతో జైనూర్ మేజర్ గ్రామపంచాయతీలో ఏడు హైమాస్ట్ ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ కొడప ప్రకాష్ తెలిపారు. మంగళవారం గ్రామంలోని బాలాజీనగర్, శివాజీనగర్, సోన్‌పటేల్ గూడ, కాసుపటేల్ గూడ, పోలీస్‌స్టేషన్, గణేష్‌నగర్ కాలనీల్లో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మి ప్రత్యేక శ్రద్ధతో లైట్లను మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వీధిదీపాల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో వెలుతురు సౌకర్యం మెరుగుపడి, రాత్రి వేళల్లో ప్రజల రవాణా ఇబ్బందులు తొలగుతాయని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ డోంగ్రే ప్రకాష్, పంచాయతీ వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

### ఓటర్ల జాబితాలను పరిశీలించుకోవాలని సూచన

**సారంగాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండలంలోని జాం, సారంగాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ విజయ్ కాంత్ రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాజా ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించి, ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి బూత్ లెవెల్ అధికారి (బీఎల్ఓ) వద్ద కూడా ఈ జాబితాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఓటర్లు తమ పేర్లు, వివరాలను ఓటరు జాబితాలో సరిచూసుకోవాలని, ఏవైనా మార్పులు, చేర్పులు లేదా సవరణలు ఉంటే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గిర్దావర్ వెంకట నర్సయ్య, జీపీఓలు వరలక్ష్మి, రహీం పాషా, రమేష్, పంచాయతీ కార్యదర్శి చైతన్య, సంబంధిత బీఎల్ఓలు పాల్గొన్నారు.

## భైంసాలో ప్రజావాణి రద్దు

### - 19న జరగాల్సిన కార్యక్రమం వాయిదా

**నిర్మల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో బుధవారం భైంసా క్యాంప్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దయినట్లు జిల్లా పోలీసు శాఖ ప్రకటించింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ కార్యక్రమానికి భైంసా, ముధోల్, తానూర్, కుంటాల, కుబీర్ తదితర మండలాల నుంచి బాధితులు, ఫిర్యాదుదారులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో కార్యక్రమం వాయిదా పడటంతో తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. సమాచారం తెలియక ప్రజలు క్యాంప్ కార్యాలయానికి వచ్చి ఇబ్బంది పడవద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర ఫిర్యాదులు, సమస్యలు ఉంటే బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని సూచించారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి, బిఆర్ఎస్ నాయకులు

## కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలి

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

పేదింటి ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణలక్ష్మి మ-షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేద కుటుంబాల ఆడబిడ్డలకు అందుతున్న ఆర్థిక భరోసాను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం అమల్లో ఉన్న కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ పథకాన్ని రద్దు చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పేద ఆడబిడ్డల పథకం కోసం ప్రభుత్వం కోర్టులో సమర్థవంతంగా వాదించలేదని ఆరోపించిన ఆమె, వెంటనే పథకాన్ని కొనసాగించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్సుకొల సరస్వతి, అలీబిన్ అహ్మద్, ఆకాష్, అజయ్, జీవన్, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏజెన్సీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి

**- పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో 75 రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్**

**జైనూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం (ఆగస్టు 19) నిర్వహించనున్న ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్‌లో ఆదివాసీ అభ్యర్థులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. గతంలో అమలు చేసిన విధంగానే ఆదివాసీలకు 75 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బంద్ నేపథ్యంలో జైనూర్ మండలంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపి సహకరించాలని కోరారు. బంద్‌కు సహకరించాలని కోరుతూ జైనూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధురాజ్ మడావి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం అర్జున్, తుడుందెబ్బ నాయకులు చాహకటి గణేష్, కోట్నాక ప్రకాష్, మెస్రం గోపాల్, ఆనక వెంకటేష్, తుమ్రం దిలీప్ కుమార్, మర్సుకోలా సంజీవ్ కుమార్, ఆత్రం శంకర్, ఆడ దుందేరావ్ తదితరులు పాల్గొన్నారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

## - జీఎం మునిగంటి శ్రీనివాస్ - ఉత్పత్తి, ఉత్పాదకతపై అధికారులతో సమీక్ష సమావేశం

నస్పూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త



బొగ్గు ఉత్పత్తి సంస్థగా నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తేనే సింగరేణి మనుగడ సాధ్యమని, ఈ ఆర్థిక సంవత్సరం ఖచ్చితంగా నూటికి నూరు శాతం రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని గనుల ఉత్పత్తి, ఉత్పాదకతపై మంగళవారం ఆయన ఏరియా ఉన్నతాధికారులు, ప్రాజెక్ట్ అధికారులు, ఏజెంట్లు, మేనేజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ విధించిన టార్గెట్లు, ఇప్పటివరకు సాధించిన బొగ్గు ఉత్పత్తి ప్రగతిపై ప్రధానంగా చర్చించారు. సమావేశం ప్రారంభంలో డీజీఎం (ఐఈడీ) రాజన్న గనుల వారీగా కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలు, సాధించిన పురోగతి, ఉత్పాదకత, పనితీరు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వివరాల ఆధారంగా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓపెన్ కాస్ట్ (ఓసీ) గనుల్లో ప్రైవేటు కాంట్రాక్టుల సమస్యలు కొలిక్కి వచ్చినందున ఓసీలలో బొగ్గు ఉత్పత్తి శాతాన్ని గణనీయంగా మెరుగుపరచాలని స్పష్టం చేశారు. అదే సమయంలో భూగర్భ గనులలో సైతం నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఏరియా ఇంజనీర్ సురేష్, ఎస్ఆర్‌పీ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఐకే ఓసీ, ఐకే 1ఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎ.వి. రెడ్డి, ఆర్.కె గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, డీజీఎంలు రాజన్న, కృష్ణారెడ్డి, మల్లయ్య, ఏరియా పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, క్వాలిటీ ఇన్‌ఛార్జ్ మురళి, వివిధ గనుల మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూప్ ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ సర్తాజ్ పాషా

## ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి

బెజ్జూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన కొట్టంగి నారాయణ (26) సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. మృతుడు సోమవారం రాత్రి బహిర్భూమికి వెళ్తున్నానని తన తల్లితో చెప్పి ఇంటి నుండి వెళ్లాడని, ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో వెతికారు. గ్రామ శివారులోని తమ వ్యవసాయ భూమిలో ఉన్న బావి వద్ద టార్చి లైటు కనిపించడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి, నీటిని మోటార్ తో బయటకు తీసి ఫుట్‌బాల్ పైపును లాగడంతో నారాయణ మృతదేహం నీటి పైకి తేలింది. బహిర్భూమికి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉండవచ్చని తండ్రి తిరుపతి తెలిపారు. తన కొడుకు మృతిపై ఎవరిపైన ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు నారాయణకు 2020లో మతిస్థిమితం కోల్పోవడంతో అప్పటినుంచి కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. ఎక్కువమంది కనిపిస్తే భయపడుతూ ఇంటికే పరిమితమయ్యేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు.

## 24 గంటల్లో దొంగతనం కేసు ఛేదన

ఆసిఫాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త



ఇంట్లో చోరీ జరిగిన కేసును 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు మంగళవారం ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ నీలం రవి పేర్కొన్నారు. ఎస్హెచ్ఓ తెలిపిన వివరాల ప్రకారం కొత్త రహపల్లి గ్రామానికి చెందిన ముంజం లలిత ఈనెల 16న వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. ఇదే అదనుగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి అల్మారా తాళం పగులగొట్టి సుమారు రూ.1.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన వడ్డె లాలాజీ (38)ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 38.320 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో నెక్లెస్, చెవి కమ్మలు, ఉంగరాలు, చిన్న చెవి కమ్మలు, ముక్కుపోగు తదితర ఆభరణాలు ఉన్నట్లు ఎస్హెచ్ఓ తెలిపారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్హెచ్ఓ తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.

## రైస్ మిల్లుల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

### - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

నస్పూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త

జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావలసిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో బి సెక్షన్ పర్యవేక్షకులు మధుసూదన్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి సంబంధిత మండలాల తహసిల్దార్లు, జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం వసూలు చేసే అంశంపై సమావేశం నిర్వహించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్‌లోని నిబంధనలు, బకాయిల వసూళ్లకు అనుసరించవలసిన విధివిధానాలు, మిల్లుల వారీగా పెండింగ్‌లో ఉన్న బకాయిల మొత్తాలపై రికన్సిలియేషన్, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 23 రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ చేయడం జరిగిందని, ప్రభుత్వానికి రావలసిన బకాయిలను పూర్తి స్థాయిలో గుర్తించి, సంబంధిత రికార్డులను సరి చూసి, నిబంధనల ప్రకారం వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కోర్టు కేసుల విషయంలో తీసుకోవలసిన చర్యలు, పెండింగ్ అంశాలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాదంలో గాయపడిన కౌన్సిలర్‌ను పరామర్శించిన మంత్రి జూపల్లి

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ ఎమ్మాజీ శారద సంతోష్‌ను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లిన మంత్రి, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, గ్రంథాలయ కమిటీ చైర్మన్ అనిల్, విశ్వప్రసాద్, మంగ, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 19న జరిగే బంద్‌ను జయప్రదం చేయండి

తాండూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

ఈ నెల 19న ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ ఆధ్వర్యంలో జరిగే ఏజెన్సీ బంద్ కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆదివాసీ, తుడుం దెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ యువతకు 75 శాతం ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల్లో న్యాయం చేయాలన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం మణికుమార్, తుడుందెబ్బ మండల అధ్యక్షులు యపాల సమ్మయ్య, జిల్లా కార్యదర్శి అరికెల శంకర్, మండల ప్రధాన కార్యదర్శి బుర్స ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు గావుడే మల్లేష్, కొలవార్ సంఘం మండల అధ్యక్షులు గొలిశెట్టి బాపు, మండల నాయకులు ఊరడి వెంకటేష్, బోగారపు ప్రశాంత్, ఎడ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసి నాయకులు

## ప్రజాబంధు ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

### - 36 మందికి కంటి పరీక్షలు.. 16 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తింపు

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన 36 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా, 16 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఆపరేషన్ అవసరమైన వారికి విడతల వారీగా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి శుక్లాలు, చూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి మంగళవారం ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే, ప్రజాబంధు ఫౌండేషన్ అధ్యక్షుడు డా. పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలి

**- డీసీపీ ఏ. భాస్కర్ - నస్పూర్ భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీసీపీ**

**నస్పూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త**

భరోసా కేంద్రానికి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల జోన్ డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశించారు. మంగళవారం ఆయన సీసీసీ నస్పూర్‌లోని భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, అక్కడ బాధితులకు అందుతున్న సేవలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పరిసరాలను పరిశీలించిన డీసీపీ, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక ధైర్యం కల్పించడం, పునరావాసం తదితర అంశాల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే బాధితులను గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను శ్రద్ధగా వినాలని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారులకు అవసరమైన సేవలను సకాలంలో అందించడంతో పాటు కేసుల పరిష్కారంలో నాణ్యత, వేగం ఉండేలా సంబంధిత శాఖలతో కలిసి పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా బాధితుల గోప్యతను కాపాడటంలో రాజీ పడకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్, షీ టీమ్ ఎస్ఐ హైమా, సిబ్బంది పాల్గొన్నారు.



భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మంచిర్యాల జోన్ డీసీపీ ఏ. భాస్కర్



## జాం వారసంతలో ప్లాస్టిక్ నిషేధానికి కృషి

**- నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 2 వేల జరిమానా**

**- సర్పంచ్ కరిపే రవళి విలాస్**

**సారంగాపూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన వారసంతలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ కరిపే రవళి విలాస్, ఉపసర్పంచ్ సంతలో తిరిగి వ్యాపారులు, వినియోగదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు తెలిపారు. సంతలో క్రయవిక్రయాలు చేసేవారు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. ఇకముందు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ వాడితే రూ. 2,000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులందరూ సహకరించి జాం గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మొద్దు

**- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు యథావిధిగా అమలు: ఆత్రం శంకర్‌రావు**

**జైనూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి ్మ, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేస్తుందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ (యు) మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్‌రావు కోరారు. ఈ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయలేదని, బీఆర్ఎస్ నాయకుల ప్రచారాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తూ లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను అందిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ కార్యవర్గ సభ్యుడు సుద్దాల శ్రీనివాస్, సర్పంచులు జానరావు, లక్ష్మి భీర్ష, శేషు నారాయణ, ఉపసర్పంచ్ రామారావు, ఏఎంసీ డైరెక్టర్ లచ్చన్న, మాజీ ప్రజాప్రతినిధులు వీణాబాయి, నాగోరావు, సీనియర్ నాయకులు దేవీదాస్, ద్రౌపతి, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులకు సహకరిస్తున్న సింగరేణికి కృతజ్ఞతలు

**- బెల్లంపల్లి మునిపల్ చైర్పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు**

**బెల్లంపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు సింగరేణి సంస్థకు సంబంధించిన విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులను బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు పరిశీలించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన చైర్‌పర్సన్, పనుల పురోగతిపై సింగరేణి అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు సహకరిస్తూ విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పనులు చేపడుతున్న సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాధాకృష్ణ కు ధన్యవాదాలు తెలియజేశారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు అన్ని వర్గాల సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మత్తమారి రాయమలు, సీనియర్ నాయకులు మునిమంద రమేష్, కంకటి శ్రీనివాస్, గాలి శ్రీనివాస్, పీక లక్ష్మణ్, రియాజ్, మున్సిపల్ సిబ్బంది, సింగరేణి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి

**చింతలమానేపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త**



పోలీసు ఉద్యోగ నియామకాల్లో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని పేర్కొంటూ ఈ నెల 19న చేపట్టనున్న ఏజెన్సీ బంద్‌కు అందరూ సహకరించాలని కోలవర్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గాట్ల శంకర్ పిలుపునిచ్చారు. గతంలో ఏజెన్సీ ప్రాంత యువతకు ఉన్న 75 శాతం రిజర్వేషన్‌ను కొనసాగించాలని, జీవో 109 ప్రకారం ఆదివాసీలకు 75 శాతం కేటాయింపులు కల్పించాలని కోరారు. అలాగే 29 శాఖల్లో జీవో 3 ప్రకారం ఆదివాసీలకు అవకాశాలు కల్పించాలని తెలిపారు. ఆదివాసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ చేపడుతున్న బంద్‌కు విద్యార్థులు, యువత, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేకల ఫణీంధర్, మేకల ప్రసాద్, బుర్ర భానుప్రసాద్, కూర్మ ప్రసాద్, ఎడ్ల వెంకటేష్, ఆత్రం అరుణ్, రసపల్లి అంజన్న, నత్తిని సాయి, ఎర్గటి నాగేష్, మేకల సతీష్ తదితర ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలి

**- బెల్లంపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజా నరేందర్**

**తాండూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త**

రైతులు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని బెల్లంపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ నరేందర్ అన్నారు. మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం ఆర్.పి.ఎల్ ఆధారిత నైపుణ్యాబివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ సాధనాల ద్వారా వ్యవసాయాన్ని మరింత శాస్త్రీయంగా నైపుణ్యభివృద్ధి సాధించేందుకు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 30 మంది రైతులకు డిజిటల్ వ్యవసాయ శిక్షణ, పురుగుతెగుళ్ల ఉధృతి, మార్కెట్ ధరలు, ప్రభుత్వ సేవలు, పంట నిర్వహణకు సంబంధించిన సలహాలను మొబైల్ అప్లికేషన్ల ద్వారా తెలుసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సుష్మ, ఏఈఓ లు రాకేష్, వెంకటేష్, మోనిక, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లంపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజా నరేందర్

# సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం వద్దు

**- బీఆర్ఎస్ ఆరోపణలను తిప్పికొట్టిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ రషీద్**

**జైనూర్, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ జైనూర్ మండల అధ్యక్షుడు షేక్ రషీద్ అన్నారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను సైతం చెల్లిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సర్పంచులు పెందుర్ అనసూయ అర్జున్, అయ్యుబాయి భుజంగరావు, ఉయిక చందు, తోడసం రాజేందర్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జాఆలి, నాయకులు దౌలత్‌రావు, కోటేష్, షేక్ రహీం, కోవా సిద్దు, మాజీ ఉప సర్పంచ్ షేక్ అబ్బు, ఆనంద్, ముత్త పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి

**(మొదటిపేజీ తరువాయి)**

సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐటీ ఉపకులపతి ప్రొఫెసర్ గోవర్ధన్, ఎన్ఐఈఎల్ఐటి హైదరాబాద్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్ కోర్ర, ఓఎస్డి మురళీ దర్శన్, ఐడెక్స్ మాజీ డైరెక్టర్ కల్నల్ (రిటైర్డ్) ఎ.కె. సింగ్, వీర టాక్టికల్ డైనమిక్స్ సీఈఓ సాయి తేజ, వివిధ సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి: డిప్యూటీ కమిషనర్ సుధాకర్

నిర్మల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:



నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల, దిలావార్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామాల్లో పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన ఫామ్ పాండ్, ఫిష్ పాండ్ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులకు చెత్తబుట్టలను అందజేసి, గ్రామంలోని స్టీల్ బ్యాంక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు చెత్తను రోడ్లపై పారవేయకుండా పంచాయతీ చెత్త సేకరణ వాహనాలకే అందించాలని కోరారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి, పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి పథకాలు, పారిశుధ్య కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోటోగ్రఫీని కళగా మలిచి ప్రత్యేక గుర్తింపు పొందుతున్న జక్కుల రాజు

**- అరుదైన దృశ్యాలకు సజీవ రూపం..**

**- ప్రభుత్వ శాఖల డాక్యుమెంటేషన్‌లో విశేష సేవలు**

మంచిర్యాల, ఆగస్టు 19, ప్రభాతవార్త

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల పట్టణానికి చెందిన ఫోటోగ్రాఫర్ జక్కుల రాజు సేవలపై ప్రత్యేక కథనం. 28 ఏళ్లకు పైగా ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న ఆయన మున్సిపాలిటీ, పోలీసు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు కీలక కార్యక్రమాలను సమర్థంగా డాక్యుమెంటేషన్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఐదుసార్లు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ సేవలందించి అధికారుల ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. గాంధారి చల్లా, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర వంటి చారిత్రక, సాంస్కృతిక అంశాలపై రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటేషన్లకు గుర్తింపు లభించింది. రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీలో ద్వితీయ బహుమతితో పాటు పలు జిల్లాస్థాయి పురస్కారాలు సైతం అందుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను సజీవ చిత్రాలుగా మలుస్తూ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు పొందిన రాజు.. ఫోటోగ్రఫీపై ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంచిర్యాల అప్పటి ఆర్డీవో వొడ్నాల రాములు చేతుల మీదుగా ఉత్తమ ఫోటోగ్రాఫర్ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఫోటోగ్రఫీ రంగంలో ఆయన అంకితభావం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.





కుట్టు మిషన్‌లు అందజేస్తున్న జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగితే ఫిర్యాదు చేయొచ్చు

**- జిల్లా ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**

ఆసిఫాబాద్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగితే ఫిర్యాదు చేయొచ్చని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సవాలు విసిరారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలు, కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విట్టల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరిష్ బాబు, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మాట్, డేవిడ్, జిల్లా గ్రంథాలయం చైర్మన్ అనిల్, మున్సిపల్ చైర్మన్లు ఆకాష్, సుల్తానాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం, మహిళలకు స్వయం ఉపాధి కల్పన, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నేరుగా చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా.. ప్రతి పేదవాడికి సొంతింటి కల.. ప్రతి మహిళకు స్వయం ఉపాధి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు గాను ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ కడుతుందన్నారు. అయినప్పటికీ జిల్లాలోని రెండు నియోజకవర్గాల అభివృద్ధికి రూ. పది కోట్ల చొప్పున మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గంకు 275 కుట్టు మిషన్లతో పాటు గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మరో 2000 ఇళ్ళు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. వట్టివాగు ప్రాజెక్ట్ కింద వరి పంట సాగు చేస్తున్న రైతుల కోరిక మేరకు వారం రోజుల పాటు 3000 ఎకరాలకు గేట్లు వదిలి నీళ్లు అందించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. చట్టాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పాలన చేస్తోందని, ఇందిరమ్మ కమిటీల ద్వారానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుట్టుమిషన్ల పంపిణీ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించాలని, ఇందిరమ్మ ఇళ్ల పత్రాల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలావరకు అసంపూర్తి వంతెనలు ఉన్నాయని, కొన్నిచోట్ల నూతన వంతెన నిర్మాణాలకు టెండర్లు అయినప్పటికీ పనులు ప్రారంభించలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వట్టివాగు ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న రైతులకు నీళ్లు అందేలా చూడాలని, ప్రభుత్వం చేపడుతున్న పనులపై అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వట్లేదని అసహానికి గురయ్యారు. సిర్పూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో మరో 1000 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలని, కాగజ్ నగర్ మండలం ఈసగామ్ శివాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన యువకుడికి మున్నూరు కాపు సంఘం పరామర్శ

కాగజ్‌నగర్‌రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త :



కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్ కాలనీకి చెందిన ఎకరి రమేష్ కుమారుడు ఆదిత్య ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలుకు ఫ్రాక్చర్ కావడంతో చికిత్స పొందారు. నాలుగు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి కాగజ్‌నగర్‌లోని తన నివాసానికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆదిత్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న లక్ష్మణ్ ధైర్యంగా ఉండాలని సూచించారు. మున్నూరు కాపు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొలిశెట్టి మహేష్, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, సిర్పూర్ తాలూకా వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లి తిరుపతి, పార్వతి సురేష్, సాయిదాం అశోక్, పులిశెట్టి వెంకటేష్ తదితర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులతో ఉద్యమాన్ని అణచలేరు

**- బిఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్**

బెల్లంపల్లి, ఆగస్టు 18, ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోద్బలంతో తమపై బనాయించిన అక్రమ కేసుకు సంబంధించి బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్‌తో పాటు మరో 8 మంది బీఆర్ఎస్వీ కార్యకర్తలు చెన్నూరు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బడికల శ్రావణ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత సమస్యలపై ప్రశ్నిస్తున్న గొంతులను అక్రమ కేసులతో అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేసులు, బెదిరింపులకు తాము భయపడేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ నేతృత్వంలో ప్రజలు, విద్యార్థుల పక్షాన నిలబడి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకులు, విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు బనాయించి ఉద్యమాలను అణచివేయాలని చూస్తే.. ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. న్యాయం కోసం పోరాడే ప్రతి గొంతుకకు బీఆర్ఎస్వీ అండగా ఉంటుందని, అక్రమ కేసులకు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని బడికల శ్రావణ్ తెలిపారు. కోర్టుకు హాజరైన వారిలో బీఆర్ఎస్వీ చెన్నూరు పట్టణ అధ్యక్షులు ఎండీ నాయబ్ ఖాన్, బీఆర్ఎస్వీ నాయకులు గోగార్ల శివ, రేణికుంట శ్రీనివాస్, నవీన్, మహేందర్, సంపత్, రవీందర్ తదితరులు ఉన్నారు.


## పేదల కంటి వెలుగుకు ఉచిత వైద్యం

**- శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**- సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 18, ప్రభాతవార్త :

పేదల కంటి సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందిస్తూ శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 28 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకోగా, వారిలో 11 మందికి కేటరాక్ట్ (కంటి శుక్లాలు) ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఎంపికైన 11 మందికి సొసైటీ సొంత ఖర్చులతో రవాణా, భోజన సదుపాయాలు కల్పించి బెల్లంపల్లిలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. ప్రతి మంగళవారం కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే శస్త్రచికిత్సలు చేయించుకుని లబ్ధి పొందిన వారు తమ పరిచయస్తులు, అవసరమైన వారికి ఈ సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణుడు శ్రీనాథ్, కంటి శిబిరం ఇన్‌చార్జి గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.





కంటి వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు